అసంపూర్తిగా లైబ్రరీ బిల్డింగ్

- అరకొర వసతులతో అద్దెభవనంలో కొనసాగుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మధ్యలో ఆగిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

వీణవంక: మండలకేంద్రంలోని గ్రంథాలయానికి చెదలు పట్టింది. శాశ్వత భవనం మంజూరై నాలుగేళ్లు గడిచినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో అద్దెభవనంలో అరకొర వసతుల మధ్య పాఠకులు కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలుండగా మండల కేంద్రంలో మాత్రమే గ్రంథాలయం ఉంది. 1984 నుంచి అద్దె భవనంలో గ్రంథాలయం కొనసాగుతుండగా వసతులు లేక, శాశ్వత గ్రంథాలయ అధికారి లేక రోజురోజు పాఠకుల సంఖ్య తగ్గుతోంది. అదేవిధంగా వార్తాపత్రికలు పూర్తిస్థాయిలో గ్రంథాలయానికి రాకపోవడంతో పాఠకులు మండిపడుతున్నారు.

రూ.14.80 లక్షల నిధులు

అద్దెభవనంలో అరకొర వసతుల నడుమ గ్రంథాలయం 49 ఏళ్లుగా కొనసాగుతోంది. పాఠకుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రూ.14.80లక్షల నిధులతో నూతనం భవనం మంజూరుచేసింది. స్థానిక జెడ్పీ పాఠశాలలో కొత్త భవనం నిర్మిస్తుండగా నిధుల మంజూరు వరకు కాంట్రాక్టర్ పనులు చేసి వదిలేశాడు. ఇంకా రూ.8లక్షల నిధులు అవసరం కాగా పనులు మధ్యలోనే నిలిపేశాడు. దీంతో నిధుల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపించినా పట్టించుకునే వారు లేకుండాపోయారు. కొత్త భవనం పూర్తయితే విద్యార్థులకు, పాఠకులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని మండల ప్రజలు ఆశిస్తున్నారు. కానీ నిధుల కొరతతో కొత్త భవనం పనులు అటకెక్కాయి. గ్రంథాలయ అధికారి ఇన్‌చార్జి కావడం కూడా పాఠకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆరేళ్లుగా ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత అధికారితో పాటు నూతన భవనం పనులు త్వరగా పూర్తిచేయాలని పాఠకులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ రమేశ్‌ను వివరణ కోరగా మరో రూ.8లక్షల నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందించామని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

చర్యలు తీసుకోవాలి



గ్రంథాలయం శాశ్వత భవనం పనులు మధ్యలో నిలిచిపోయాయి. పనులు త్వరగా పూర్తి చేయాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ నాలుగేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఎంతోమంది నిరుపేద విద్యార్థులు పోటీ పరీక్షలకు గ్రంథాలయంలో చదువుకునేందుకు వస్తున్నారు. కానీ పుస్తకాలు లేవు. కొంత కాలంగా ఇన్‌చార్జి అధికారే ఉంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి శాశ్వత అధికారితో పాటు నూతన భవనం పనులు పూర్తిచేయించాలి.

– చింతల శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

అధికారిని నియమించాలి

గ్రంథాలయ నిర్వహణ సరిగా లేక పుస్తకాలు చెదలు పట్టాయి. పత్రికలు కూడా పూర్తిస్థాయిలో లేవు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. శాశ్వత అధికారి లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అద్దె భవనంలో ఉండటం వల్ల మంచినీటి వసతి, మరుగుదొడ్లు లేవు. నూతన భవనం పనులు పూర్తి చేసి అందులోకి మార్చాలి.

– కిరణ్, పాఠకుడు, వీణవంక

క్లుప్తంగా

రూ. లక్ష ఆర్థిక సాయం గడువు పెంచాలి

చొప్పదండి: బీసీ కులాలకు ఇచ్చే రూ.లక్ష ఆర్థిక సాయం గడువును పెంచాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. 20వ తేదీ గడువు విధించడంతో ఆన్‌లైన్ సేవలు సహకరించక అర్హులలో గందరగోళం ఏర్పడిందని, పదిరోజుల గడు వు పెంచాలని, సర్వర్ వ్యవస్థను మెరుగు పరుచాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటవెంటనే జారీ చేయాలన్నారు. వెంట వీరేశం, కోటేశ్, కళ్యాణ్, సురేశ్, తదితరులున్నారు.

సీసీ కెమెరాల పనితీరు పరిశీలన



సుందరగిరిలో సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్న ఎస్సై రాజేశ్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును శనివారం ఎస్సై సామల రాజేశ్ పరిశీలించారు. సుందరగిరి, బొమ్మనపల్లి, నవాబుపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఒక సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానమని టెక్నీషియన్‌లకు పలు సూచనలు, సలహాలు చేశారు. కెమెరాలు సక్రమంగా పనిచేస్తేనే నేరాలు అదుపులో ఉంటాయన్నారు.ఆయన వెంట పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాకారులు

జమ్మికుంట: పట్టణంలో తల్లి నా వెలిశాల.. నీకున్నది చరిత్ర చాలా.. ప్రజాకవి, సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్ రాసిన పాట 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25న భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సాహిత్య కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పట్టణానికి చెందిన జాతీయ కళారత్న అవార్డు గ్రహీత ప్రభాకర్ శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. వెలిశాల ఉద్యమాలకు పురిటి గడ్డ, తూపాకుల మోతలతో నిరంతరం ప్రజలు భయాందోళనతో గడిపిన సందర్భం, గ్రామ చరిత్రను కళ్లకు కట్టినట్టు పాట ద్వారా తెలియజేశారని అన్నారు. సాహిత్య కార్యక్రమానికి కవులు, కళాకారులు అభిమానులు, మేధావులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంబాల రాజు, కళాకారులు కాశీ, సందాన్, మహేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆపన్నహస్తం



చిన్నారితో ఫౌండేషన్ సభ్యులు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన నాలుగేళ్ల గగన అనే బాలికను చొప్పదండిలోని విద్య ఫౌండేషన్ సభ్యులు దత్తత తీసుకొని చదివించేందుకు ముందుకువచ్చారు. తల్లి లేకపోవడంతో తండ్రి మల్లేశం భవిష్యత్‌లో అమ్మాయికి విద్యావకాశాల్లో ఇబ్బంది రాకూడదని ఫౌండేషన్‌ను సంప్రదించాడని దీంతో చదివించేందుకు దత్తత తీసుకుంటున్నామని సభ్యులు ప్రకటించారు. ఇప్పటికే వేదాంత్ అనే అబ్బాయిని, ఇప్పుడు అమ్మాయిని దత్తత తీసుకున్నామని ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశం, నారాయణ, శివ, మల్లేశం, రాజేశ్ పవార్, మునీందర్, సందీప్, మహేశ్, జగన్, వెంకటేశం, శేఖర్, తదితరులున్నారు.

పంప్ ఆపరేటర్‌గా సర్పంచ్



తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య పంప్ ఆపరేటర్‌గా అవతారం ఎత్తారు. గ్రామానికి చెందిన పంప్ ఆపరేటర్ వారం రోజులుగా అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో గ్రామస్తులు నల్లా నీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారని శనివారం పంప్ ఆపరేటర్‌గా మారి ఆదర్శంగా నిలిచారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచారం

నేడు మెగా వైద్య శిబిరం

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ), అమెరికా వైద్య బృందం(ఆప్పి) ఆధ్వర్యంలో రెండో విడుత ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని గ్రామస్తుడు అమెరికా వైద్యుడు డాక్టర్ నేరేళ్ల దామోదర్(ఎండీ) తెలిపారు. ప్రజలు, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ మూలాలకు చెందిన అమెరికా వైద్యుల సంఘం గ్రామీణ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా దేశంలో దత్తత గ్రామం పథకం ద్వారా దేశంలో 61 గ్రామాలను ఎంపిక చేసుకున్నామని, మొదటి విడతగా జనవరిలో దామోదర్ తల్లిదండ్రులు స్వర్గీయ నేరేళ్ల రాధమ్మ, రామస్వామి జ్ఞాపకార్థం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. రెండో విడతగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో గుండె సంబంధిత, జనరల్, పీడియాట్రిక్, మధుమేహం, ఆర్థోపెడిక్‌తోపాటు అనేక ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు.

రేపు శ్రీశివా శతక పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలుగు పద్యకవితా సదస్సు ఆధ్వర్యంలో సాహితీవేత్త, అవధాని, డాక్టర్ గంద్ర లక్ష్మణరావు రచించిన శ్రీశివా శతక ఆవిష్కరణ సోమవారం సాయంత్రం 5 గంటలకు గాయత్రీనగర్ గణేశ శారదా శంకరాలయం(అఖిల బ్రాహ్మణ సేవ సంఘం భవనం)లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రామక విఠల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



ప్రొసీడింగ్ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మండలంలోని వెదిర గ్రామ శ్రీవినాయకరెడ్డి సంక్షేమ సంఘం స్కిల్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ హాల్‌కు మంజూరై రూ.4 లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని శనివారం సంఘం సభ్యులకు బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు అవసరమైన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవితలక్ష్మణ్, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వెదిర రెడ్డి సంఘం అధ్యక్షుడు భూంరెడ్డి, శ్రీవినాయకరెడ్డి సంఘం అధ్యక్షకార్యదర్శులు రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, సంఘం సభ్యులు జనార్దన్‌రెడ్డి, నవీన్ రెడ్డి, కిష్టారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



డిక్షనరీలు అందిస్తున్న భాస్కర్

సైదాపూర్: విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆకునూర్ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ హనుమాండ్ల భాస్కర్ అన్నారు. ఇంగ్లిష్ సబ్జెక్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు శనివారం డిక్షనరీలను హెచ్ఎం అనురాధ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిదని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుస్తకాలు, ఆర్థికసాయంతో ప్రోత్సహిస్తున్న భాస్కర్‌ను హెచ్ఎం అనురాధ అభినందించారు. ఈకార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు పరిహారం అందేలా చర్యలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రం పరిధిలో గత శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటి, ఈత చెట్లు కాలిపోయి తీవ్రనష్టం వాటిల్లింది. శనివారం తహసీల్దార్ జయంత్, ఎక్సైజ్ ఎస్సై శ్రీలత ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటామని పేర్కొన్నారు. కాలిపోయిన చెట్లపై ఆధారపడిన గీతకార్మికులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా పరిహారం అందేలా చూడాలని గౌడసంఘం నాయకులు తహసీల్దార్ జయంత్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజు, సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, గౌడసంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు బి.తిరుపతి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు బి.చంద్రం, బి.రాజయ్య, టి.రాములు, డి.రాజయ్య, బి.రాజు, బి.శ్రీకాంత్, టి.అరవింద్, అనిల్, రమేశ్, కొండయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘ఓట్లకోసమే దశాబ్ది ఉత్సవాలు’



మానకొండూర్: మాట్లాడుతున్న రామిడి తిరుపతి



హుజూరాబాద్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మానకొండూర్: రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయని బీఆర్‌ఎస్ ప్రజల్లోకి ఎలా వెళ్లాలనే ఉద్దేశంతో దశాబ్ది ఉత్సవాలు చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రామిడి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో ఏం అభివృద్ధి చేయలేదని, ఉత్సవాల పేరిట చికెన్, మటన్ అధికారికంగా వండిపెట్టిన సందర్భాలు ఎప్పుడైన ఉన్నాయా అంటూ మండిపడ్డారు. కార్యకర్తలను మచ్చిక చేసుకునే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. రూ.లక్ష రుణమాఫీ చేసినందుకా, రైతులు పండించిన ధాన్యం అధికంగా తూకం వేసినందుకా, సబ్సిడీపై రైతులకు డ్రిప్ వంటి పరికరాలు ఇవ్వనందుకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారా అని అన్నారు. డిపార్ట్‌మెంటుల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో తెలపాలని చెరువులు అభివృద్ధి చేసి ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారని అన్నారు. పండుగ వేళ కాకుండా ఇతర సందర్భాల్లో బతుకమ్మ పేర్చుతూ గౌరమ్మను అగౌరవపరుస్తున్నారని, ఏ గ్రామంలో సీసీ రోడ్డు, మురుగు కాలువ వేశారో చూపెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు బీసీలు గుర్తుకు వచ్చారా అంటూ ప్రశ్నించారు. భవిష్యత్‌లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వరహాల చారి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరి దేవయ్య, జిల్లా కార్యదర్శి మీస సత్యనారాయణ, బాకారపు శ్రీనివాస్, అపరాజు శ్రీనివాస్, మర్రి ఓదెలు, కొమురయ్య, పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ విఫలం

హుజూరాబాద్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. హుజూరాబాద్ ఉపఎన్నిక సమయంలో పత్రికా విలేకర్లకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, కేసీఆర్ ఆటోనగర్ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలుకాలేదన్నారు. అధికార పార్టీ నాయకులు మాటల్లోనే అభివృద్ధి చూపుతున్నారని, క్షేత్ర స్థాయిలో ఎలాంటి అభివృద్ధి జరగటం లేదన్నారు. సమావేశంలో నాయకులు సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, ఎండీ అప్సర్, పుష్పలత, ఎర్ర రమేష్, తునికి రవి, ఆవుల సంపత్, చొప్పదండి విజేందర్, ఆడెపు ఐలయ్య, సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిన ‘చెక్‌డ్యామ్’ పనులు

- రెండేళ్ల కిందట నిర్మాణం ప్రారంభం
- ఎన్నేళ్లకు పూర్తయ్యేనో



అర్కండ్ల వాగులో అసంపూర్తిగా చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణం నిధులు లేక పనులు నిలిచిపోయాయి.కేశవపట్నం, అర్కండ్ల, గద్దపాక వాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంకు మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ.9కోట్ల నిధులు మంజూరు చేసింది. గద్దపాక , కేశవపట్నం వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తి చేశారు. అర్కండ్ల వాగులో పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినప్పటికీ కొంతమేర నిర్మించి వదిలిపెట్టారు. భూగర్భజలాల పెంపుకోసం వాగులో చెక్‌డ్యామ్ నిర్మిస్తున్నామని అధికారులు చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. అర్కండ్ల గ్రామం జనాభా పరంగా చిన్నదైనప్పటికీ రెవెన్యూ పరంగా వ్యవసాయభూములు ఎక్కువగా ఉన్నాయి. చెక్‌డ్యామ్‌తో భూగర్భజలాలు పెరిగి వాగుకు ఇరువైపుల ఉన్న వ్యవసాయభూములకు సాగునీటి కొరత ఉండదు. అధికారులు పనులు చేపట్టి మధ్యలో ఆపివేయడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. అర్కండ్ల వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. గతంలో మంజూరైన నిధులు సరిపోకపోవడంతో రీ ఎస్టిమేట్ పంపినట్టు తెలిసింది. ఎండ తీవ్రతకు గ్రామస్తులు, మూగజీవాలకు తాగునీటి సమస్య ఏర్పడింది.

నిధులు మంజూరు చేయాలి



అర్కండ్ల వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణం జరిగితే నీటి సమస్య తీరుతుంది. ప్రజలకు, మూగజీవాలకు తాగు నీరు, వ్యవసాయ పంటలకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయి. అధికారులు వెంటనే నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి.

– శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్, అర్కండ్ల

పంటలు ఎండిపోతున్నాయి



వర్షాకాలంలో అర్కండ్ల వాగు ప్రవహించినప్పుడు సాగు నీటి సమస్య ఉండదు. యాసంగిలో సాగునీరు సరిపోక పంటలు ఎండిపోతున్నయి. వాగులో చెక్‌డ్యామ్ పనులు ప్రారంభిస్తే సంతోషపడ్డాం. రెండేళ్లు గడిచినా పనులు చేపట్టడంలేదు .

– మేకల సంపత్, అర్కండ్ల

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్థానిక యువత ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడతూ.. క్రీడలపై యువత ఆసక్తి, నైపుణ్యంతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్లు రాము, పా నగంటి మల్లయ్య, మారేపల్లి భిక్షపతి, శ్రీపతి నరేష్, పాతకాల రమేష్, గాజుల భాస్కర్, రావికంటి రాజు, బచ్చుశివశంకర్, సారంగం, రామ డుగు రవీందర్ రావు, ఆర్గనైజర్స్ రాజు, శశి తదితరులు పాల్గొన్నారు.